క్లుప్తంగా

నూతన ధ్వజస్తంభానికి ప్రత్యేక పూజలు



మధురానగర్(విజయవాడసెంట్రల్): మాచవరం దాసాంజనేయస్వామివారి ఆలయంలో నూతన ధ్వజస్తంభ ప్రతిష్ట మహోత్సవాలను పురస్కరించుకుని ఎమ్మెల్యే మల్లాది విష్ణు శనివారం ధ్వజస్తంభానికి ప్రత్యేక పూజలు చేశారు. ఎమ్మెల్యే విష్ణు మాట్లాడుతూ ఎంతో మహిమాన్వితమైన దాసాంజనేయస్వామి ఆలయంలో తుపానుకు ధ్వజస్తంభం మరమ్మతులకు గురైన నేపథ్యంలో కొత్తది ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఆలయ ఈవో నాగినేని భవాని, ధర్మకర్తల మండలి ఛైర్మన్ కనపర్తి కొండలరావు మాట్లాడుతూ ఈ నెల 19 నుంచి 22 వరకు ధ్వజస్తంభ ప్రతిష్ట మహోత్సవాలు జరుగుతాయని తెలిపారు. ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించి తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు, ప్రత్యేక ఆహ్వానితులు, భక్తులు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

దోమల నివారణకు చర్యలు



మధురానగర్(విజయవాడసెంట్రల్): నగరంలో ఇటీవల కురిసిన వర్షానికి ఖాళీ స్థలాల్లో నిలిచిన వర్షపునీటిలో దోమలు వృద్ధి చెందకుండా నగరపాలకసంస్థ మలేరియా విభాగం సిబ్బంది గంబూసియా చేపలను శనివారం వేశారు. మలేరియా ఇన్‌స్పెక్టర్ అనిల్‌కుమార్ మాట్లాడుతూ దోమలు నీటి నిల్వల్లో పెరుగుతాయని కావున ప్రతి ఒక్కరూ తమ ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని చెప్పారు. దావు బుచ్చయ్యకాలనీలో ఇటీవల కురిసిన వర్షాలకు ఖాళీస్థలాలు చెరువులుగా మారాయని సాక్షిలో కథనం ప్రచురితం అయ్యిందన్నారు. దీంతో ముందు జాగ్రత్తగా దోమల నివారణకు గంబూసియా చేపలు వేస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో మలేరియా సూపర్‌వైజర్ బెనర్జీ, సిబ్బంది పాల్గొన్నారు.

క్రీస్తు బోధనలు సదా స్మరణీయం

విజయవాడ కల్చరల్: క్రీస్తు బోధనలు సదా స్మరణీయమని క్రిస్టియన్ మ్యూజిక్ కాలేజీ విశాఖపట్నం ఫౌండర్, డైరెక్టర్ డాక్టర్ మహర్షి అన్నారు. పోలుకొండ మంగతాయారు స్మారక సాంఘిక సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యాన గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో కవి సమ్మేళనం, డాక్టర్ మహర్షి రచించిన శాస్త్రీయ సంగీత తెలుగు క్రైస్తవ కీర్తనలు గ్రంథావిష్కరణ, పరిచయ సభ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. పుస్తకాన్ని ఆవిష్కరించిన డాక్టర్ మహర్షి మాట్లాడుతూ ప్రభువైన క్రీస్తు మానవాళికి శాంతి సందేశం అందించినట్లు తెలిపారు. సీనియర్ జర్నలిస్ట్ ఘంటా విజయకుమార్ మాట్లాడుతూ శాంతి దూత సేవలను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. సంస్థ వ్యవస్థాపకురాలు వి.ఉమామహేశ్వరి సంస్థ లక్ష్యాలను వివరించారు. యేసయ్య జీవనం-పాపవిమోచనం అంశంగా జరిగిన కార్యక్రమాన్ని పి.కల్యాణి సమన్వయ పరిచారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన కవులు స్వీయ కవితా గానం చేశారు. కార్యక్రమంలో రెవరెండ్ డీజీకే పాల్, బ్రదర్ అనిల్‌కుమార్, సిస్టర్ నిర్మల, స్వర్ణదీపిక సంపాదకుడు శివాజీరాజు పాల్గొన్నారు.

నిత్యాన్నదానం

గన్నవరం: స్థానిక కోనాయి చెరువు సమీపంలో అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో స్వాములకు నిత్య అన్నదానం నిర్వహిస్తున్నారు. సురేష్‌స్వామి నేతృత్వంలో దాతల సహకారంతో 15 రోజులుగా అన్నదానం కొనసాగుతోంది. ప్రతి రోజు 300 నుంచి 400 మంది అయ్యప్ప స్వాములు, భవానీలు, శివ, గోవిందస్వామి మాల ధరించిన స్వాములకు అన్నదానం చేస్తున్నారు. మండల దీక్షలు పూర్తయ్యే వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుందని సురేష్‌స్వామి తెలిపారు. నిత్య అన్నదాన కార్యక్రమానికి సహకారం అందిస్తున్న దాతలందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

ప్రతి ఒక్కరికీ సంక్షేమం

ఎమ్మెల్యే మల్లాది విష్ణు



గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజలకు సంక్షేమ పథకాల బ్రోచర్ అందజేస్తున్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): అర్హతే ప్రామాణికంగా ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నామని రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. 36వ డివిజన్ 196వ వార్డు సచివాలయం పరిధిలో జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ బాలి గోవింద్‌తో కలిసి శనివారం ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి అర్జీలు, సూచనలు స్వీకరించారు. ఎమ్మెల్యే విష్ణు మాట్లాడుతూ దేశంలోనే ప్రజల వద్దకు పాలన చేరువ చేస్తూ సంక్షేమ పథకాలు లబ్ధిదారుని ఇంటి వద్దకే అందిస్తోన్న ఏకైక ప్రభుత్వం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వమేనని పేర్కొన్నారు. టీడీపీ హయాంలో పేదలు పూర్తిగా నిర్లక్ష్యానికి గురయ్యారని చెప్పారు. కానీ నేడు ఏ గడపకు వెళ్లినా ప్రభుత్వ పథకాల్లో కనీసం 3నుంచి 8 పథకాల ద్వారా లబ్ధి పొందుతున్నట్లు ప్రజలు చెబుతున్నారని వెల్లడించారు. రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధికి అహర్నిశలు పాటుపడుతున్న సీఎం జగన్‌కే తమ మద్దతు అంటూ ప్రజలు ముందుకు వస్తున్నారని తెలిపారు.

దొంగ ఓట్లు నమోదుకు టీడీపీ కుట్ర...

వైఎస్సార్ సీపీ ఇచ్చిన ఫిర్యాదుపై ఎలక్షన్ కమిషనర్ స్పందించిన తీరు హర్షణీయమని ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. దొంగ ఓట్లు నమోదు చేయించడంలో చంద్రబాబు సిద్ధహస్తుడని తెలంగాణ నుంచి పెద్ద సంఖ్యలో డూప్లికేట్ ఓట్లను ఏపీకి తీసుకొచ్చే కుట్రలు జరుగుతున్నాయని ఆరోపించారు. ఏపీలో నమోదైన 4,30,264 డూప్లికేట్ ఓట్లను గుర్తించిన తాము.. ఈసీ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. తెలంగాణలో ఓటు వేసిన వారిని తిరిగి ఏపీలో ఓటు వేయకుండా చూడాలని కోరడం జరిగిందన్నారు. వీటిపై స్పందించిన ఎలక్షన్ కమిషన్.. తప్పుడు సమాచారంతో ఓటర్ నమోదుకు ప్రయత్నించే దరఖాస్తుదారులపై పీపుల్స్ యాక్ట్ సెక్షన్ 31 ప్రకారం కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించడం జరిగిందన్నారు. టీడీపీ చేస్తున్న కుట్ర రాజకీయాలకు రానున్న ఎన్నికల్లో మరోసారి గట్టి గుణపాఠం తప్పదని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు పులపా కృష్ణ, రామకృష్ణ, రెడ్యం ఆర్కే, భాస్కర్, యడ్ల రాంబాబు, పఠాన్ భూపతి, ఇప్పిలి శ్రీను, పప్పుల శివ, తాటి శివ, అరుణ్‌బాబు పాల్గొన్నారు.

ఇంటిపట్టాల జారీ కోసం సర్వే



అంబేడ్కర్‌కాలనీలో సర్వేచేస్తున్న వీఆర్‌ఓ గోపాలకృష్ణ

మధురానగర్(విజయవాడసెంట్రల్): 31వ డివిజన్ అంబేడ్కర్ కాలనీలో ఎమ్మెల్యే మల్లాది విష్ణు ఆదేశానుసారం ఇంటిపట్టాల జారీకు సర్వేను శనివారం నిర్వహించారు. వీఆర్‌ఓ గోపాలకృష్ణ ఇంటింటికీ వెళ్లి అర్హుల వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా వీఆర్‌ఓ మాట్లాడుతూ ఇప్పటికే కొంత మందికి ఇంటి పట్టాలు జారీ చేసేందుకు పనులు పూర్తయ్యాయని పేర్కొన్నారు. అయితే ఇంకా కొంత మంది అర్హత కలిగిన వారు ఉన్నారని వారికి కూడా న్యాయం చేయాలని వైఎస్సార్ సీపీ డివిజన్ అధ్యక్షుడు పెనుమత్స సత్యం విజ్ఞప్తి మేరకు మరోమారు సర్వే చేస్తున్నామని తెలిపారు. సత్యం మట్లాడుతూ తమ ప్రభుత్వంలో అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ న్యాయం జరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, వార్డు సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

17న వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ జిల్లా మహాసభ



వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ జిల్లా మహాసభల వాల్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న గవాస్కర్, సాయిరాం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): విజయవాడ నగరంలోని ఐవీ ప్యాలెస్ నందు ఈ నెల 17న వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ ఎన్టీఆర్ జిల్లా మహాసభ జరుగనున్నట్లు జోనల్ కోఆర్డినేటర్ ఒగ్గు గవాస్కర్, ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు సాయిరాం తెలిపారు. గవర్నర్‌పేట కోర్టుల భవనం బీబీఏ హాల్ వద్ద మహాసభల వాల్ పోస్టర్‌ను శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహాసభలకు ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు ఇతర ప్రజా ప్రతినిధులు హాజరవుతారన్నారు. జిల్లా మహాసభలను న్యాయవాదులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పిళ్లా రవి, మన్మథరావు, సూరిబాబు, చిన్నం రామకృష్ణ, చంద్రమౌళి, చావలి అబ్రహంలింకన్, కళ్యాణ్, వైవీ సీహెచ్ రాజశేఖర్, రాజేష్, సౌమ్య, ఉషాజ్యోతి, ప్రభాకర్, నాగిరెడ్డి, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన సంగీతోత్సవాలు



సంగీత కచేరి నిర్వహిస్తున్న సుధీర్‌శర్మ

విజయవాడ కల్చరల్: గాయక సార్వభౌమ సంగీత పరిషత్ స్వరఝరి సంగీత సాహిత్య సేవా సంస్థ ఆధ్వర్యంలో సంగీత విద్వాంసుడు పారుపల్లి రామకృష్ణయ్య పంతులు 140వ జయంతిని పురస్కరించుకుని నాలుగు రోజులుగా నిర్వహిస్తున్న సంగీతోత్సవాలు శనివారం ముగిసాయి. ముగింపు కార్యక్రమంలో ప్రవాసాంధ్ర సంగీత విద్వాంసుడు కొరిడే సుధీర్‌శర్మ పలు వాగ్గేయకారుల కీర్తనలను మధురంగా ఆలపించారు. వయోలిన్‌పై ఎస్ జనార్ధన్, మృదంగంపై బీఎస్ ప్రశాంత్, కంజీరాపై శ్రీకాంత్ సహకరించారు. సుధీర్‌శర్మ మాట్లాడుతూ శాస్త్రీయ సంగీత విలువలను కాపాడుకోవాల్సిన అవసముందన్నారు. స్వరఝరి అధ్యక్షుడు మోదుమూడి సుధాకర్ మాట్లాడుతూ పారుపల్లి రామకృష్ణయ్య పంతులు స్ఫూర్తితో కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. నిర్వాహకులు సుధీర్‌శర్మను ఆత్మీయంగా సత్కరించారు. కార్యక్రమంలో సంగీత విద్వాంసులు అన్నవరపు రామస్వామి, అంజనా సుధాకర్, వేమూరి విశ్వనాథ్ పాల్గొన్నారు.

సమకాలీనమైన కవిత్వం కాలానికి నిలుస్తుంది



మాట్లాడుతున్న అకాడమీ సభ్యుడు ప్రసేన్ వేదికమీద కవి ఖాదర్‌మోహిద్దీన్

విజయవాడ కల్చరల్: సమకాలీనమైన కవిత్వం కాలానికి నిలుస్తుందని కేంద్ర సాహిత్య అకాడమీ సభ్యుడు ప్రసేన్ అన్నారు. అకాడమీ ఆధ్వర్యంలో బందరురోడ్డులోని బాలోత్సవ భవన్‌లో కవిసంధి వినూత్న సాహిత్య కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. కవులు సాహిత్యంతో పరిచయం చేసుకోవాలని ఆధునిక కవిత్వంలో వస్తున్న మార్పులను అధ్యయనం చేయాలని సూచించారు.

పుట్టమచ్చ కవి ఖాదర్‌మోహిద్దీన్ గురించి మాట్లాడుతూ సమకాలీనమైన అంశాలు ఆయన కవిత్వంలో కనిపిస్తాయని చెప్పారు.కవి ఖాదర్ మోహిద్దీన్ తాను రచించిన పుట్టమచ్చ కవితా సంపుటిలోని కవిత్వాన్ని వినిపించారు. నేడు కవిత్వంలో వస్తున్న మార్పులు, వస్తువు, రచనా సంవిధానం అంశంగా కవులు ఆయనతో ముఖాముఖి చర్చించారు. ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని కవులు కవిసంధి కార్యక్రమంలో పాల్గొన్నారు.

బహుజన అధికారులు, ఉద్యోగుల ఫెడరేషన్ ఆవిర్భావం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): బహుజన సిద్ధాంత- భావజాలాలతో బహుజన ఆఫీసర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ (బోఫ్) ఆవిర్భవించింది. విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో శనివారం జరిగిన సమావేశంలో ఫెడరేషన్ ఆవిర్భావ సభ జరిగింది. సభలో తొలుత 'ప్రతి విద్యార్థి ఇంట భారత రాజ్యాంగం' పుస్తకాల'ను ఆవిష్కరించారు. అనంతరం జాతీయ, రాష్ట్ర కమిటీలు, వివిధ కమిటీలను నియమించారు. సమాఖ్య జాతీయ అధ్యక్షుడిగా డాక్టర్ దేవరకొండ వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షుడిగా షేక్ అబ్దుల్ రజాక్, ఏపీ అధ్యక్షుడిగా ముత్తవల్లి అబ్దుల్ సలార్, కార్యదర్శిగా దేవరకొండ సాంబశివరావు, ఉపాధ్యక్షుడిగా ప్రణీత వర్మ తదితరులను నియమించారు. బహుజన రీసెర్చ్ వింగ్, అడ్వైజరీ బోర్డు, సాంస్కృతిక వింగ్, క్రమశిక్షణ కమిటీ, పలు కమిటీలను ప్రకటించారు.

భక్తులకు ఇబ్బంది కలగకుండా దర్శనం

దుర్గగుడి ఈఓ రామారావు



యాగశాల వద్ద ఉభయదాతల వివరాలను పరిశీలిస్తున్న ఈఓ రామారావు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): అమ్మవారి దర్శనానికి విచ్చేసే భక్తులకు ఇబ్బంది కలిగించకుండా ప్రశాంత వాతావరణంలో దర్శనం కల్పించాలని దుర్గగుడి ఈఓ కె.ఎస్.రామారావు పేర్కొన్నారు. ఇంద్రకీలాద్రిపై ప్రసాదం కౌంటర్లు, మల్లేశ్వరాలయ పనులను ఈవో రామారావు శనివారం పరిశీలించారు. తొలుత సర్వ దర్శనం, రూ.100, రూ.300 క్యూలైన్లను పరిశీలించారు. భక్తులకు త్వరితగతిన అమ్మవారి దర్శనం అయ్యేలా క్యూలైన్లు ముందుకు నడపాలని ఆలయ అధికారులను ఆదేశించారు. నటరాజ స్వామి వారి ఆలయం సమీపంలోని ప్రసాదం కౌంటర్లను తనిఖీ చేసిన ఈఓ రామారావు భక్తులతో మాట్లాడారు. ప్రసాదం త్వరితగతిన భక్తులకు అందేలా చూడాలని సిబ్బందికి సూచించారు. అనంతరం కొబ్బరి కాయలు కొట్టే కౌంటర్‌లో ఈఓ రామారావు భక్తులతో మాట్లాడారు. కొబ్బరి కాయలు తమ చేతుల్లో నుంచి తీసుకుని సిబ్బందే కొట్టేస్తున్నారని, డబ్బులు డిమాండ్ చేస్తున్నారని ఈఓ దృష్టికి తీసుకెళ్లారు. భక్తుల నుంచి ఫిర్యాదులు వస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం మల్లేశ్వరస్వామి వారి ఆలయం సమీపంలో పారిశుద్ధ్య పనులు పరిశీలించారు. యాగశాలలోని చండీహోమంలో ఉభయదాతల వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం మల్లేశ్వర స్వామి వారి ఆలయ అభివృద్ధి పనులను పరిశీలించారు. ఆలయం చుట్టూ రాతి మండపం పనులు వేగంగా పూర్తవ్వడానికి చర్యలు తీసుకోవాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. ఈఓ వెంట ఏఈఓ ఎస్.రమేష్‌బాబు, ఏఈ లక్ష్మణ్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

అన్ని వర్గాలకు అండగా జగనన్న

డీసీఎంఎస్ చైర్ పర్సన్ స్నిగ్ధ



కానూరులో గీజర్లు అందజేస్తున్న డీసీఎంఎస్ చైర్ పర్సన్ పడమట స్నిగ్ధ

పెనమలూరు: రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలకు జగనన్న అండగా ఉండి పారదర్శక పాలన అందిస్తున్నారని డీసీఎంఎస్ చైర్ పర్సన్ పడమట స్నిగ్ధ అన్నారు. రక్ష ఫౌండేషన్ ఆధ్వర్యంలో కానూరు సిద్దిక్ నగర్‌లోని మదర్సాకు రూ.50 వేలు విలువ చేసే గీజర్లను శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా స్నిగ్ధ మాట్లాడుతూ పేదరిక నిర్మూలనే లక్ష్యంగా జగనన్న కృషి చేస్తున్నారని తెలిపారు. అన్ని వర్గాలకు అర్హతే ప్రామాణికంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేసి పేద కుటుంబాల ఉన్నతికి కృషి చేస్తున్న ఏకైక ప్రభుత్వం వైఎస్సార్ సీపీ ప్రభుత్వమేనని చెప్పారు. మహిళల ఆర్థికాభివృద్ధి, విద్యా, వైద్యం, వ్యవసాయం ఇలా అన్ని రంగాల్లో రాష్ట్రం ముందంజలో ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో మదర్సా ప్రిన్సిపాల్ సోహైల్ అక్తర్, సభ్యులు హఫీజ్ ఇబ్రహీం, హమీద్, డైరెక్టర్ ఖాదర్ వహాబ్ హనూరియాజ్ పలువురు పార్టీ నేతలు పాల్గొన్నారు.

ముగిసిన ఫ్యాకల్టీ శిక్షణ

పెనమలూరు: గంగూరు ధనేకుల ఇంజినీరింగ్ కాలేజీలో శనివారం ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం ముగిసింది. ఈ నెల 4వ తేదీన ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ అండ్ ట్రైనింగ్ ప్రిన్సిపల్ కార్యదర్శి ఎస్.సురేష్‌కుమార్ శిక్షణను ప్రారంభించారు. వివిధ యూనివర్సిటీల నుంచి వచ్చిన ప్రొఫెసర్లు వారం రోజుల పాటు లార్జ్ స్కేల్ ఇంటిగ్రేటెడ్ సర్క్యూట్ డిజైన్ సాంకేతిక పురోగతిపై శిక్షణ ఇచ్చారు. డిజైన్ టూల్స్, అనల్‌లాగ్ డిజైన్, భద్రత, ప్రాజెక్టులు వివిధ అంశాలపై ప్రొఫెసర్లు వివరించారు. ముగింపు కార్యక్రమంలో డైరెక్టర్ రవిప్రసాద్, ప్రిన్సిపాల్ కడియాల రవి, డీన్‌లు రావి సత్యప్రసాద్, ఏ.సుధీర్‌బాబు, డీవీవీ.శ్రీకాంత్, ఎం.వంశీకృష్ణ, వివిధ విభాగాల అధ్యాపకులు పాల్గొన్నారు.

చురుగ్గా వాటర్ ట్యాంక్ నిర్మాణ పనులు

రూ. 4.5 కోట్లతో నిర్మాణం



జీవీఆర్‌నగర్‌లో నిర్మిస్తున్న వాటర్ ట్యాంక్



వాటర్ ట్యాంక్ వద్ద పైపులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): వేగంగా అభివృద్ధి చెందుతున్న 30వ డివిజన్ గద్దే వెంకట్రామయ్యనగర్‌లో వాటర్ ట్యాంక్ నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఇక్కడి ప్రజల తాగునీటి సమస్యను స్థానిక కార్పొరేటర్ బీహెచ్ఎస్‌వీ జానారెడ్డి ఎమ్మెల్యే మల్లాది విష్ణు దృష్టికి తీసుకెళ్లగా ఆయన అధికారులతో మాట్లాడి వాటర్ ట్యాంక్ నిర్మాణానికి రూ. 4.5కోట్లు మంజూరు చేశారు. అయితే ఇక్కడ వాటర్ ట్యాంక్ నిర్మాణానికి అవసరమైన స్థలం లేకపోవడంతో నిర్మాణ పనుల్లో జాప్యం జరిగింది. దీంతో కార్పొరేటర్ జానారెడ్డి స్థానికులు, రెసిడెన్సియల్ వెల్ఫేర్ అసోసియేషన్ నేతలతో మాట్లాడి వాటర్ ట్యాంక్ నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని సేకరించారు. స్థల యజమానులకు బాండ్లు జారీచేసి వాటర్‌ట్యాంక్ నిర్మాణ పనులు ప్రారంభించారు. వాటర్‌ట్యాంక్ నిర్మాణంతో గద్దే వెంకట్రామయ్య నగర్, దావు బుచ్చయ్యకాలనీ, వినాయకనగర్‌తో పాటు ట్రెండ్‌సెట్‌కు కృష్ణా జలాలు అందించవచ్చు. ఇప్పటి వరకు బోర్ వాటర్‌పైనే ఆధారపడిన ప్రజలు కృష్ణా వాటర్ కోసం ఎన్నో ఏళ్లుగా అడుగుతున్నప్పటికీ గత ప్రభుత్వ హయాంలో స్థలం లేదంటూ వాటర్ ట్యాంక్ నిర్మాణం చేయలేదు.

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చొరవతో వాటర్ ట్యాంక్ నిర్మాణ పనులు ప్రస్తుతం శరవేగంగా జరుగుతున్నాయి. ఇప్పటికే ఈ ప్రాంతంలో రూ. 4కోట్ల వ్యయంతో పైపులైన్ పనులు పూర్తికాగా వాటర్‌ట్యాంక్ లేకపోవడంతో తాగునీటి సరఫరా జరగడం లేదు. వాటర్ ట్యాంక్ నిర్మాణం పూర్తయితే తాగునీటి కష్టాలు తీరుతాయని స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

త్వరలో తాగునీటి సరఫరా..



గద్దే వెంకట్రామయ్యనగర్, దావు బుచ్చయ్యకాలనీ, వినాయకనగర్ ప్రాంతాలకు కృష్ణా జలాలు అందజేయాలనే ఉద్దేశంతో వాటర్ ట్యాంక్ నిర్మాణం చేపట్టాం. ట్యాంక్ నిర్మాణానికి స్థలం లేకపోవడంతో స్థానికులతో మాట్లాడి 1200 గజాలు సేకరించి వారికి బాండ్లుజారీ చేసి నిర్మాణ పనులు ప్రారంభించాం. త్వరలోనే పనులు పూర్తిచేసి తాగునీటిని సరఫరా చేస్తాం.

– బీహెచ్ఎస్‌వీ జానారెడ్డి కార్పొరేటర్

రామలింగేశ్వరునికి పండ్లు, పూలతో పూజలు



మధురానగర్(విజయవాడసెంట్రల్): ముత్యాలంపాడు శ్రీపార్వతీ సమేత రామలింగేశ్వరస్వామివారి దేవాలయంలో కార్తిక మాసోత్సవాల్లో భాగంగా స్వామివారికి పండ్లు, పూలతో శనివారం ప్రత్యేక పూజలు జరిగాయి. ఆలయ అర్చకులు స్వామివారికి ప్రీతికరమైన మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, బిల్వార్చనలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం పండ్లు, పూలతో స్వామివారిని అలంకరించారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమాలను ఆలయ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

శ్రీదత్తసాయి శివకామేశ్వరీ పీఠంలో...

అయోధ్యనగర్ శ్రీదత్తసాయి శివకామేశ్వరీ పీఠంలో శ్రీధర్మపరిషత్ మహాసంస్థానం ఆధ్వర్యాన స్వామివారికి అన్నాభిషేకం జరిగింది. కార్యక్రమాలను పీఠం వ్యవస్థాపకుడు అవ్వా హేమసుందర వరప్రసాద్ పర్యవేక్షించారు.

నేడు లక్ష దీపోత్సవం

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): విశ్వహిందూ పరిషత్ విజయవాడ మహానగర్ నారాయణి సేన సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం 5.30 గంటలకు మొగల్రాజపురం రావిచెట్టు సెంటర్‌లో లక్ష దీపోత్సవం నిర్వహిస్తున్నామని ఆ సంస్థ అధ్యక్షుడు పిట్టల గోవింద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.కార్యక్రమంలో పాల్గోవాలనుకునేవారు ఆదివారం సాయంత్రం 5 గంటలలోపు 77949 78373 నంబర్‌లో పేర్లు నమోదు చేసుకోవాలని తెలిపారు.





కనులపండువగా దీపోత్సవం

శత సహస్ర దీపార్చన సేవా మండలి ఆధ్వర్యాన దుర్గాపురంలోని సంగీత కళాశాలలో శనివారం కార్తిక దీపోత్సవం కనులపండువగా సాగింది. దీనిలో భాగంగా సామూహిక సత్యవ్రతం, లక్ష దీపార్చన చేశారు. తాళ్లాయపాలెం పీఠాధిపతి శివస్వామి 'కార్తిక' ప్రాశస్త్యాన్ని భక్తజనానికి వివరించారు. –సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

అత్తింటి వేధింపులపై కేసు

చిట్టినగర్(విజయవాడ పశ్చిమ): అత్తింటి వేధింపులపై కొత్తపేట పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. మహంతిపురం ఐస్ ఫ్యాక్టరీ ప్రాంతానికి చెందిన హనిమకు ఖమ్మం జిల్లా కొణిజెర్లకు చెందిన వేణుతో ప్రేమ వివాహమైంది. కొంత కాలంగా అత్త నర్సమ్మ, మామ వెంకన్న, ఆడపడుచు శ్రావణి, ఆమె భర్త వేణుకు లేనిపోనివి చెప్పి వేధింపులకు గురిచేస్తున్నారు. భర్త విడాకులు ఇవ్వాలని బెదిరించాడు. దీంతో ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది.